దోమల రహిత సమాజమే అందరి లక్ష్యం

జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ బి.రామారావు



ముస్తాబాదలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బి.రామారావు

గన్నవరం రూరల్: దోమల రహిత సమాజ నిర్మాణం ఆరోగ్యానికి సోపానమని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ బి.రామారావు అన్నారు. ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.రామారావు మాట్లాడుతూ దోమలు పుట్టకుండా నివారించడమే లక్ష్యంగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై-డే పాటిస్తూ ప్రతి గ్రామంలో నీరు నిల్వ ఉంటే ప్రదేశాలు గుర్తించి ఆ నీటిని బయటకు పంపాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది తరచూ గ్రామాల్లో పర్యటించాలని చెప్పారు. విద్యార్థులు దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవడంతో పాటు, మిగిలిన వారికి కూడా తెలియజేయాలని సూచించారు. మండల వైద్యాధికారి శ్రీహర్ష ఆధ్వర్యంలో జక్కులనెక్కలం, కొండపావులూరు, సూరంపల్లి, చనుపల్లివారిగూడెం గ్రామాల్లో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వర బాధితులకు మందులు అందజేశారు. ఆరోగ్య సమాజ నిర్మాణం కర్తవ్యం కావాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్‌వీ రామగోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన ర్యాలీ

పాయకాపురం(విజయవాడరూరల్): దోమల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరుతూ పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్ విద్యార్థులు, వైద్య సిబ్బందితో కలిసి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు 'దోమలను నివారిద్దాం-ఆరోగ్యాన్ని కాపాడుకుందాం' అనే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.రాజా మాట్లాడుతూ దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. ఇళ్ల ముందు మురుగునీరు నిల్వ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డ్రెయినేజీలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.



ర్యాలీ చేస్తున్న పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది

జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి



స్టీల్ ప్లేట్లు, గ్లాసులు సరఫరా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్లాస్టిక్ వినియోగం మానవ మనుగడకు అత్యంత ప్రమాదకారిగా మారిందని, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ అధినేత అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం అన్నారు. ఇళ్లలో జరిగే ఫంక్షన్లకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఎలాంటి అద్దె లేకుండా ఉచితంగా భోజనం, టిఫిన్ తినే స్టీల్ ప్లేట్లు, మంచినీళ్లు, టీ తాగే స్టీల్ గ్లాసులను అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం చేతుల మీదగా మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మానవత చేస్తున్న కృషిని అడుసుమిల్లి అభినందించారు. ఇటీవల రోజుల్లో విందు భోజనాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు విరివిగా వినియోగించడం ద్వారా పర్యావరణానికి ఎంతో ముప్పు ముంచుకొస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీన్ని అరికట్టేందుకుగానూ మానవత చేపట్టిన కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. మానవత కేంద్ర కమిటీ కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపోయేందుకు 20 నుంచి 500 ఏళ్లు పడుతుందని చెప్పారు. ఏటా లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల మట్టి కాలుష్యం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల భవిష్యత్ తరాలు తీవ్ర సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజల్లో అవగాహన పెంపొందించడం కోసం స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అద్దె లేకుండా ఫంక్షన్లకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మానవత హనుమాన్‌జంక్షన్, కైకలూరు శాఖల అధ్యక్షులు గూడపాటి జయ రామచంద్రరావు, కొండ్రెడ్డి సత్యనారాయణ, కార్యదర్శి పాటోలు గణేష్, సీనియర్ సభ్యులు మేడికొండ పద్మజ, జన్యావుల సత్యనారాయణ, నారగాని కొండలరావు, కొట్నాని రామచంద్రరావు, వడ్డి రాజేశ్వరరావు, పొట్లూరి శేషాచలం, వేగిరెడ్డి సూర్యనారాయణ, తాడి రంగారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధనేకుల కళాశాల ప్రిన్సిపాల్‌కు సత్కారం



పెనమలూరు: ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి ఉత్తమ సేవలు అందించినందుకు కాకినాడ జేఎన్‌టీయూ సత్కరించి అవార్డు ప్రదానం చేసింది. కాకినాడలో మంగావారం జరిగిన కార్యక్రమంలో ఆయన అవార్డు స్వీకరించారు. ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో 15 సంవత్సరాలుగా ఆయన ప్రిన్సిపాల్‌గా ఉత్తమ సేవలు అందించి ఎందరో విద్యార్థులకు భవిష్యత్తుకు బాట వేశారు. కాలేజీలో విద్యార్థులకు పరిశోధన, గుణాత్మక విద్య, బోధనా పద్ధతులు, ఉపాధి కల్పన తదితర విషయాల్లో విశేష సేవలు అందించినందుకుగాను జేఎన్‌టీయూ అవార్డు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ ధనేకుల రవీంద్రనాథ్ ఠాగూర్, డైరెక్టర్లు భవానీప్రసాద్, రవిప్రసాద్, అధ్యాపకులు రవికి అభినందనలు తెలిపారు.

నున్న వైద్యుడికి గోల్డ్‌మెడల్



భీమవరపు గౌతమ్‌రెడ్డి

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన డాక్టర్ భీమవరపు గౌతమ్‌రెడ్డి గోల్డ్‌మెడల్ సాధించారు. ఉత్తరప్రదేశ్, లక్నోలోని కింగ్ జార్జెస్ మెడికల్ యూనివర్సిటీలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తూ, ఎంసీహెచ్‌లో ప్లాస్టిక్ అండ్ రీ కన్‌స్ట్రక్టివ్ సర్జరీలో సూపర్ స్పెషాలిటీ కోర్సు చేస్తున్న గౌతమ్‌రెడ్డి గోల్డ్‌మెడల్ సాధించారు. ఈనెల 17వ తేదీన లక్నోలోని కింగ్ జార్జెస్ మెడికల్ యూనివర్సిటీలో జరిగిన కాన్వొకేషన్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఆనందిబెన్ పటేల్ నుంచి గోల్డ్ మెడల్ అందుకున్నారు.

ఉత్తమ ప్రదర్శన ఇన్‌స్టిట్యూట్‌గా ఉషారామ కళాశాల



ఉంగుటూరు: ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఉత్తమ ప్రదర్శన ఇన్‌స్టిట్యూట్‌గా నిలిచిందని ఆ కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం తెలిపారు. జేఎన్‌టీయూ కాకినాడలో మంగళవారం ఫార్మేషన్ డే సందర్భంగా జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఉషారామ కళాశాల ఉత్తమ ప్రదర్శన ఇన్‌స్టిట్యూట్ అవార్డును అందుకుంది. అలాగే టీచర్స్ అప్రిసియేషన్ అవార్డ్స్‌లో కెమిస్ట్రీ విభాగానికి చెందిన డాక్టర్ బీఎస్ శ్రీనివాసరావు అవార్డు అందుకోగా మొత్తం 3అవార్డులను ఉషారామ కైవసం చేసుకుంది. అవార్డులు పొందిన ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్, బీఎస్ శ్రీనివాసరావులను సుంకర రాంబ్రహ్మం అభినందించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



కంకిపాడు: అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి పిఎం. కిరణ్ అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు, కంకిపాడులోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారులు మంగళవారం తనిఖీ చేశారు. 16.16.16 ఎరువు ఐపీఎల్ కంపెనీది రూ. 1,400, రూ. 1,375, రూ. 1,250 చొప్పున మూడు రేట్లు ఉన్నాయని రైతులు గందరగోళానికి గురికావాల్సిన పని లేదన్నారు. కృత్రిమ కొరత సృష్టించి ఎరువులను బ్లాక్ చేస్తే సహించేది లేదన్నారు. నిర్దేశిత ధరలకే ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. అధిక ధరలపై రైతులు ఫిర్యాదులు చేస్తే విచారించి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకాపురం(విజయవాడరూరల్): పాయకాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఇంగ్లిష్(ఆంగ్లం), వృక్షశాస్త్రం (బోటనీ) సబ్జెక్టులను బోధించేందుకు గెస్ట్ లెక్చరర్స్‌గా పని చేయుటకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు జిల్లా విద్యాధికారి సీఎస్ఎస్ఎన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టులో కనీసం 50 శాతం తక్కువ కాకుండా ఉత్తీర్ణులైన అభ్యర్థులు సదరు నకలు కాపీలతో నేరుగా ఈ నెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు డీవఈఓ ఆఫీసు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాయకాపురం నందు హాజరుకావాలని తెలిపారు. గెస్ట్ ఫాకల్టీగా ఎంపికైన వారికి గంటకు రూ. 150 చొప్పున, గరిష్ఠంగా నెలకు రూ. 10 వేలకు మించకుండా చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. రిటైర్డు ప్రొఫెసర్స్, లెక్చరర్స్, జూనియర్ లెక్చరర్స్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు.

పంట కోత ప్రయోగాల నిర్వహణపై శిక్షణ



ప్రొద్దుటూరులో వీపీఏలకు శిక్షణ ఇస్తున్న డీఎస్‌ఓ సత్యనారాయణమూర్తి

కంకిపాడు: పంట కోత ప్రయోగాలను సమర్థంగా నిర్వహించాలని జిల్లా డీఎస్ఓ సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో పంట కోత ప్రయోగాల నిర్వహణపై వీపీఏలకు క్షేత్రస్థాయి శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ నిర్దేశిత ప్రదేశంలో పంట కోత ప్రయోగం ఎలా నిర్వహించాలి?, దిగుబడి అంచనా సమర్థంగా ఎలా ఉండాలని వంటి అంశాలను వివరించారు. వాస్తవ గణాంకాలు సమగ్ర పరిశీలన ద్వారానే వస్తాయన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది పంట కోత ప్రయోగాల అంచనాలను బాధ్యతతో పూర్తి చేయాలని, నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ భాగ్యశ్రీ, మండల వ్యవసాయాధికారి పిఎం కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై నిరసన ర్యాలీ



పోరంకిలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: కోల్‌కతా ఆర్‌జీకర్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు నిరసనగా మంగళవారం మండల పరిధిలో నిరసన ర్యాలీ నిర్వహించారు. పోరంకిలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో తాడిగడప నుంచి పోరంకి వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ర్యాలీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్, మహిళలు పాల్గొన్నారు.

కానూరులో...

కానూరులో అశోక్‌జిమ్, మాతృహృదయ్ స్వచ్ఛంద సంఘ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకుడు తాళ్లూరి అశోక్ మాట్లాడుతూ డాక్టర్ మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు పవన్, అనిల్, అజయ్, ప్రముఖులు కాంతారావు, వైష్ణవ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఫుట్‌వేర్ పార్క్ ఏర్పాటుకు కృషి

- జీఎస్టీ పెంపు, బీఐఎస్ నిబంధనలతో నష్టాల ఊబిలో పాదరక్షల పరిశ్రమలు
- ఏపీ ఫుట్‌వేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న చుక్కపల్లి అరుణ్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో పాదరక్షల తయారీ, విక్రయ రంగాలను ప్రమోట్ చేసేందుకు విజయవాడలో ఫుట్‌వేర్‌పార్క్ ఏర్పాటుకు కృషి జరుగుతుందని ఏపీ ఫుట్‌వేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చుక్కపల్లి అరుణ్‌కుమార్ అన్నారు. దీనిపై ఇప్పటికే ప్రతిపాదనలు కేంద్ర కామర్స్ అండ్ ఇండస్ట్రీ మంత్రికి అందజేసినట్లు పేర్కొన్నారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇటీవల దేశ వ్యాప్తంగా పాదరక్షల పరిశ్రమ జీఎస్టీ పెరుగుదల, బీఐఎస్ నిబంధనల విధింపుతో సంక్షోభాన్ని ఎదుర్కొన్నట్లు తెలిపారు. పాదరక్షలపై 5 శాతం ఉన్న పన్నును 12 శాతానికి పెంచడంతో ఈ పరిశ్రమ నష్టాల ఊబిలో చిక్కుకున్నట్లు తెలిపారు. జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని, వివిధ రాష్ట్రాల పాదరక్షల సంఘాలతో కలిసి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. బీఐఎస్ నిబంధనల నుంచి చిన్న, మధ్యతరహా యూనిట్లు ప్రాథమిక దశలో మినహాయించాలని గతేడాది కాలంగా చేసిన పోరాటం ఫలించి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సంఘ కార్యదర్శి వీర్‌ప్రీత్‌సింగ్, అనీల్‌కుమార్ భవానీ, సభ్యులు బీఎస్ కోటేశ్వరరావు, శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

అసోసియేషన్ 2024-26 సంవత్సరానికి మేనేజింగ్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చుక్కపల్లి అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా డి భరత్‌కుమార్, వీర్‌ప్రీత్‌సింగ్, కార్యదర్శిగా అనీల్‌కుమార్‌భవానీ, కోశాధికారిగా హెచ్ చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీలుగా వైపీ రమేష్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అందమైన ప్రేమకావ్యం 'సీతారాం సిత్రాలు'



నగరంలోని ఓ హోటల్‌లో సీతారాం సిత్రాలు చిత్ర హీరో లక్ష్మణ్, దర్శకుడు నాగ శశిధర్‌రెడ్డి

లబ్బీపేట(విజయవాడతూర్పు): పాత రోజులను గుర్తు చేస్తూ పెళ్లి, వీసీఆర్ క్యాసెట్‌పై అల్లిన ఒక అందమైన ప్రేమకథాచిత్రమే సీతారాం సిత్రాలు అని ఆ చిత్ర హీరో లక్ష్మణ్ అన్నారు. ఈ నెల 30న విడుదల కానున్న ఆ సినిమా అందరినీ ఆకట్టుకుంటుందన్నారు. ఎంజీ రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో లక్ష్మణ్ మాట్లాడుతూ తాను సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సమయంలో చిత్ర దర్శకుడు నాగ శశిధర్‌రెడ్డి చెప్పిన కథ విని హీరోగా నటించేందుకు అంగీకరించినట్లు తెలిపారు. కేవలం రూ.కోటిన్నరతో సినిమా పూర్తి చేశామని, నలుగురు నిర్మాతలు ఈ చిత్రాన్ని అందమైన ప్రేమ కావ్యంగా మలిచారన్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రమోషన్ కార్యక్రమం వేగవంతంగా చేశామని, వెళ్లిన ప్రతి కాలేజీలో యువత తమను ఎంతగానో ఆదరిస్తున్నట్లు పేర్కొన్నారు. దర్శకుడు నాగశశిధర్‌రెడ్డి మాట్లాడుతూ సినిమాల్లో కంటెంట్ ఉంటే ప్రేక్షకులు చిన్న చిత్రమైన పెద్ద చిత్రమైన తప్పక ఆదరిస్తారనే నమ్మకంతో సీతారాం సిత్రాలు ప్రేమకథ తీసినట్లు తెలిపారు. ఈ సినిమాలో యూట్యూబ్ ద్వారా అందరికీ చిరపరిచితమైన భ్రమరాంబిక నటించినట్లు చెప్పారు. సమావేశంలో సహ నిర్మాత పవన్‌రాజు, యూనిట్ సభ్యులు మహమ్మద్ సలీం, ఇర్ఫాన్, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు

గన్నవరం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా ఈ నెల 21న చేపట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని జైమాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోగులమూడి రాము పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ ఆదేశాలు జారీచేయడం అప్రజాస్వామికమని అన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన సుప్రీం కోర్టు తీర్పును నిరసిస్తూ చేపట్టిన భారత్ బంద్‌కు అన్ని వర్గాలు మద్దతుగా నిలవాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, వాణిజ్య, వ్యాపార సంస్థలు బంద్‌కు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకి సెక్షన్ సాలిపేట ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా సాలిపేట, ఏపీఎం గార్డెన్స్, పెనమలూరు సెంటర్, బందరు రోడ్డు, సిద్ధిక్‌నగర్ కట్ట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. స్థానికులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

వచ్చే నెల 25న వాలీబాల్ టోర్నమెంట్

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గూడవల్లి వెంకటసుబ్బయ్య ఎంప్లాయిస్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన సెప్టెంబర్ 25వ తేదీన వన్డే కప్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు అని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులను సిద్ధం చేయాలని వ్యాయామోపాధ్యాయులను కోరారు. మరింత సమాచారం కోసం 9441061808 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం వాయిదా

కంకిపాడు: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం వాయిదా పడినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే తగినన్ని ఆల్బెండజోల్ మాత్రలు అందుబాటులో లేనందున సెప్టెంబరు 17కి మార్చడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్యశాఖద్వారా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో మాత్రలు అందిస్తారన్నారు. ఆల్బెండజోల్ మాత్రలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు శ్రీనాగసాయిబాబా మందిర వార్షికోత్సవం

పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలోని శ్రీ నాగసాయిబాబా మందిర ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త షేక్ లాల్‌బాష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచన, నవగ్రహ మండపారాధన, చతుర్ధ కలశస్నపన, బాబావారి మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, బాబావారి మధ్యాహ్న హారతి, అనంతరం అన్నప్రసాద వితరణ జరుగునని పేర్కొన్నారు.

డిప్యూటేషన్‌పై సీఆర్‌డీఏకు గన్నవరం తహసీల్దారు

గన్నవరం: గన్నవరం మండల తహసీల్దారు కె. వెంకటశివయ్య డిప్యూటేషన్‌పై సీఆర్‌డీఏకు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 5వ తేదీన ఆయన గన్నవరం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. కేవలం 15 రోజుల వ్యవధిలోనే తహసీల్దారు బదిలీ కావడం ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

నగరంలో 'ఆయ్' సందడి



'ఆయ్' హీరో హీరోయిన్‌లు నితిన్, నయన్‌సారిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలో ఆయ్ చిత్ర బృందం మంగళవారం సందడి చేసింది. పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని ఎస్ ఎస్ ఇడ్లీ హోటల్లో టిఫిన్ చేసి, అక్కడకు వచ్చిన వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ చిత్ర హీరో నార్నే నితిన్ మాట్లాడుతూ ఆయ్ చిత్రం విడుదలైన అన్ని చోట్ల పాజిటివ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో సక్సెస్ టూర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో థియేటర్స్‌లో ప్రేక్షకులను కలిసి కృతజ్ఞతలు చెపుతున్నామని, ప్రతిచోట బ్రహ్మరథం పడుతున్నట్లు చెప్పారు. అనంతరం హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ ఆయ్ చిత్రం విజయవంతం కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ చిత్రంలో తాను తెలుగింటి అమ్మాయిలా కనిపించానని, చిత్రాన్ని వీక్షించి సక్సెస్ చేసిన ప్రేక్షకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులు విధుల బహిష్కరణ



రామవరప్పాడు పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రామవరప్పాడు: కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించారు. సుమారు 90 మంది పారిశుద్ధ్య కార్మికులు తమ విధులు బహిష్కరించి పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో వేతనాల కమిటీ నిర్ణయించిన దానిప్రకారం అన్‌స్కిల్డ్ వర్కర్స్‌కు రూ. 569, సెమి స్కిల్డ్ వర్కర్స్‌కు రూ. 683, స్కిల్డ్ వర్కర్లకు రూ. 797 చొప్పన చెల్లించాలని ఆదేశాలున్నా పాటించకపోవడం దురదృష్టకరమన్నారు. వేతనాల కమిటీ నిర్ణయించిన దానికి తగ్గకుండా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసనలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ కమిటీ అధ్యక్షుడు సీతారామరాజు, కార్యదర్శి వీరమ్మ, వర్కర్లు పాల్గొన్నారు.

పంచాయతీ అధికారుల చర్చలు

పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు, సర్పంచ్ వరి శ్రీదేవి సీఐటీయూ, వర్కర్స్ యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. త్వరలో పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసి పక్క పంచాయతీ ప్రసాదంపాడులో సిబ్బందికి ఏ విధంగా వేతనాలు చెల్లిస్తున్నారో అదేవిధంగా రామవరప్పాడు పారిశుద్ధ్య కార్మికులకు కూడా చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. దీంతో పారిశుద్ధ్య కార్మికులు బుధవారం నుంచి విధులకు హాజరవుతామని ప్రకటించారు.

స్వీపర్లకు జీతాలు చెల్లించండి



పెనమలూరు ఎంఈఓ కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న స్వీపర్లు

పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలల స్వీపర్లకు బకాయిగా ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని స్వీపర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం పెనమలూరు ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓలు శేషగిరిరావు, కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు వివరాలు తెలుపుతూ గత ఐదు నెలలుగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు జీతాలు చెల్లించలేదన్నారు. దీని కారణంగా కుటుంబ పోషణకు ఆర్థిక సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యను ప్రభుత్వం గుర్తించి వెంటనే జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు మస్తాన్‌వలి, ఉప్పాడ త్రిమూర్తి, పాఠశాలలకు చెందిన స్వీపర్లు పాల్గొన్నారు.

వృద్ధుడు ఆత్మహత్య.. కేసు నమోదు

గన్నవరం: కుటుంబ ఆస్తి వివాదాల విషయమై ఓ వృద్ధుడు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై గన్నవరం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. మండలంలోని బీబీ.గూడెం గ్రామానికి చెందిన తోటకూర పెద్దసుబ్బారావు(74) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు ఇరువురు కుమారైలు ఉన్నారు. ఈ నేపథ్యంలో పెద్ద కుమారైతో నెలకొన్న ఆస్తి వివాదం కారణంగా కోర్టులో ప్రైవేట్ కేసు నడుస్తుంది. ఈ కేసు విషయమై తరుచూ కోర్టులు తిరుగుతున్న పెద్దసుబ్బారావు మనస్తాపానికి గురై పురుగుల మందు సేవించాడు. అపస్మారక స్థితిలో పడివున్న అతనిని గ్రామస్తులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పెద్దసుబ్బారావు మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి



పోటీలో గెలుచుకున్న మెమెంటోలు, మెడల్స్‌తో విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): శాస్త్రీయ పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తి పెంపొందించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి హైస్కూల్ కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ అన్నారు. ఈ నెల 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర జలవనరుల శాఖ నిర్వహించిన వేడుకల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. వీటిలో గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమి హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. చిత్రలేఖనం పోటీలో యశ్వంత్ (స్పేస్ ప్లే గ్రౌండ్) అభి మనోహర్ (మై థీమ్ స్పేస్ క్రాఫ్ట్), వీనస్ (ద మూన్ సర్ఫేస్)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుసుకున్నారు. అదేవిధంగా అంతరిక్ష పరిశోధనల పురోగతిపై జరిగిన వక్తృత్వ పోటీలో నఫీస, నవ సందీప్ ఫస్ట్, సెకండ్ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. బెస్ట్ స్కూల్ కింద అంబేడ్కర్ విద్య అకాడమీకి జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా మంగళవారం హైస్కూల్‌లో విజేతలకు అభినందన కార్యక్రమం జరిగింది. విజేతలను అభినందించినవారిలో ప్రధానోపాధ్యాయుడు తరుణ్ బాబు, అంబేడ్కర్ యువ జన సంఘం ఉపాధ్యక్షుడు ఆర్ గోపాలం, సైన్స్ టీచర్లు టీ సుజాత, ఎస్‌కే షరీఫ్ ఉన్నారు.